సుశి

శ్రీమతి మాలతీ చందూర్

"[illegible] గురించి చెప్పరూ?" [illegible] అన్నాడు సత్యం.

"నాగురించా?" అంటూ ఆశ్చర్యంగా ఆగిపోయింది సుశీల.

"ఏం అంత ఆశ్చర్యపోతున్నారు?"

"ఆశ్చర్యంగానే వుంది. నాగురించి ఏం చెప్పను? నేను అతిసామాన్యస్త్రీని. నాలో పురుషుల రక్తం లేదు. నేను లాటరీలో పదివేలు సంపాయించలేదు. సంఘాన్ని ఎదిరించలేదు. అతి సామాన్యంగా గడిచే నా జీవితంలో ఏముంది చెప్పేందుకు?"

"నేను మీ జీవితం సాహసాల్తోనూ, ఏవో అనుభవాల్తోనూ నిండిందని అనటం లేదు. అతి ప్రశాంతంగా కనిపించే మీ లోంచి ఆ కథ ఎలా వస్తున్నాయూ...?" అని తల ఎగరవేశాడు సత్యం.

"భారతదేశంలోని ప్రతి పదో స్త్రీ జీవితం నా జీవితంతో శృతి కలుపుతుంది. అంటే యీ ముప్పైఅయిదు కోట్లలో ఎంత మంది నాలాటివారు వున్నారో చూడండి. అందువల్ల నాలో ప్రత్యేకత లేదన్నాను [illegible]ని మీకు చెప్పకూడదని కాదు. నాకు [illegible]ప్పకూడనివేమీ లేవు." అంది సుశీల నవ్వుతూ.

"ఇదే ఆఖరుసారి యింక అడగను" అన్నాడు సత్యం బుంగమూతితో.

సుశీల నవ్వి "కోపంలో మీ మొహం వుత్త బండబ్బాయిమొఖంలా వుంటుంది. నా జీవితంలో థ్రిల్స్ లేవు. వినండి నాలుగు ముక్కల్లో చెప్తాను."

సత్యం వుత్సాహంగా తలెత్తాడు.

"అమ్మ ముఖం ఎరగను. నాన్న బీదవాడు. ఆ బీద నాన్నగూడా పదో ఏట పోయాడు. తదనంతరం బస్తీలోని మామయ్య యింటికొచ్చాను. అత్త ఎంత చెప్తే అంత మామయ్యకి. నన్ను వదిలించుకొనేందుకు వాళ్లు నాకో పెళ్లిగూడా చేశారు. ఆయనకి నూకలు లేక, నన్ను బాలవితంతువును చేసి పోయాడు. మనువర్తిపేరిట రెండువేలూ, యీ యిల్లూ వచ్చాయి. అప్పటికి పదహారో ఏడు. సేవాసదనంలో జేరాను. స్కూల్ ఫైనల్ ప్యాసయి, ట్రైనింగ్ చదివాను. రెండేళ్ల క్రితం కార్పరేషన్లో టీచరుగా జేరాను. నెలకి నల్భైఎనిమిది వస్తాయి. యింట్లోవున్న ఆ రాజమ్మకి యిరవైరూపాలు యిస్తాను; భోజనం పెడ్తుంది. ఆరునెలలనుంచీ మీరు చూస్తున్నారే- మేడమీద గది. ఆ గదిలో నా మకాం. ఆ రాజమ్మ యింకా నలుగురైదుగురికి వంటచేసిపెట్టి తన పొట్ట పోసుకుంటుంది. ఆ రాజమ్మ యీ సుశీలకి సాయం. ఇది యీనాటిదాకా నాచరిత్ర" అంది గుక్క తిప్పుకోకుండా సుశీల.

"మీరు భలేవారు. 'కట్టెకొట్టె తెచ్చె' అన్నట్లు పాతికేళ్ల మీ జీవితాన్ని పది మాటల్లో చెప్పారే!"

సుశీల తలెత్తలేదు. యిద్దరూ సందుమలుపు తిరిగారు. సుశీల తలమీద నీరెండ పడుతోంది. ఆ నీరెండలోని కాంతిని గుప్పిట్లో కిముద్చుకోవాలనే తాపత్రయానికి ఎంత అర్థమో సుశీలని-అసలు సుశీలని-పట్టుకోవాలి అనుకోడంలో కూడా అంతే అర్థం. సత్యం తలవంచుకు నడుస్తున్నాడు. సుశీల బహుచిత్రమయిన మనిషి. తన కష్టాల్ని - యిబ్బందుల్ని ఎంత వోర్పుగా విందో పైగా తనకే కష్టాలు లేనట్లు మాట్లాడుతుంది. ముళ్లబాటల్లోంచి నడిచి- అవి పువ్వులని సరిపెట్టుకునే సహనం ఎవరు నేర్పారో యీమెకు?

"లోపలికి రారూ?" అనే సుశీల కంఠంతో యీ లోకంలోకి వచ్చిపడ్డాడు. సత్యం మెట్లు ఎక్కుతున్నాడు. సుశీల రాజమ్మతో టీ పెట్టమని చెప్పేందుకు వెళ్లింది.

ఆరునెలలనుంచి చూస్తున్నా, ఆ గదినే డెందుకో సత్యానికి కొత్తగా కన్పడింది. ప్రతివస్తువా అమెరిగ్గా, పొందుగా, శుభ్రంగా అమర్చింది సుశీల. సుశీలకు రాని పనేమిటో? అల్లికలు, కుట్లు అన్నీ నేర్పుగా కుట్టి టేబుల్ మీద కిటికీలకు తెరలు కట్టింది. ఎంతటి క్రమశిక్షణకీ ఎంత పవిత్రత! వాలుకుర్చీమీద కూచున్నాడు. సాయంత్రపుగాలి ఏవో సందేశాల్ని మోసుకు వస్తోంది.

అడుగుల చప్పుడుకు తలెత్తి చూశాడు సత్యం. సుశీల మొహం కడుక్కుని గదిలోకి వచ్చింది. అప్పుడు జ్ఞాపకం వచ్చింది సత్యానికితను మధ్యాహ్నం భోంచెయ్యనట్లు.

బొట్టు పెట్టుకుంటూ 'దీపాలవేళ అయింది. యిప్పుడు టీ ఏమిటి. భోంచెయ్యమంటోంది రాజమ్మ. మీరు కూడా రండి. యిద్దరం భోంచేద్దాం' అంది సుశీల.

తన ముఖం పట్టి కనుక్కుందా తను మధ్యాహ్నం భోంచెయ్యలేదని. ఇద్దరూ ఒకే పంక్తిని కూచుని నవ్వుకుంటూ భోంచేశారు.

* * *

ఆరునెలల క్రితం సుశీలతో పరిచయం అయింది సత్యానికి.

ఒకనాటి మధ్యాహ్నం ఆఫీసులో కూచుని టపా చూసుకుంటున్నాడు సత్యం. ఆరు భాగాలుగా వచ్చింది. ఒక నవలిక పోస్టులో. రచయిత ఎవరా అన్నట్టు చూశాడు సత్యం. ఎవరో స్త్రీ 'సుశి' అని రాసిపంపింది. అడ్రసుకూడా మద్రాసులోనే. మొదటిపేజి ఎలా వుంటుందో చూడబోయి నవల చివరంటా పూర్తిగా చదివాడు. తనికి చాలా బాగుంది. కాని ఆ కథకు పారితోషికం యిచ్చి ప్రచురించేపాటి శక్తి తన పత్రికకు లేదు.

'తేజస్సు' ప్రతివారమూ వెలువడటమే బ్రహ్మప్రళయంగా వుంది. డబ్బు యివ్వకుండా అచ్చువెయ్యడానికి మనస్కరించదు. డబ్బిచ్చే తాహతు 'తేజస్సు'కి లేదు. సత్యంలో నిజాయితీఅనేది పూర్తిగా చావకపోవడంవల్ల డబ్బు తను యిచ్చుకోలేనని రచయితకు తెల్పుతూ - వారిఆమోదం పొందినతర్వాత ఆ రచనలు అచ్చువేసేవాడు.

ఇంట్లో వుద్యోగం వెలిగించరాదా అనే భార్య ఎత్తిపొడుపులుగా పిల్లలు ముగ్గురికీ సరిఅయిన మందూ-మాకూ యిప్పించలేని తన నిస్సహాయం, 'డబ్బూ దస్కం వున్నవాళ్లు పత్రికలూ, పుస్తకాలూ వేసి విజ్ఞానం నలుదెసలా వెదజల్లాలిగాని, భార్యాపిల్లల్ని పోషించలేని నీకెందుకీ బాధ' అనే హితుల బోధలూ, అన్నిటినీ సహిస్తూ తన జీవితలక్ష్యం అనుకుని అలా కుంటిగా 'తేజస్సు'ని లాక్కొస్తున్న సత్యానికి

సుశీల రాసిన 'తపన' ఏదో కొత్త వార్త మోసుకొచ్చింది.

తను పైకం యివ్వలేనని, అందుకు అంగీకరిస్తే రచన తను పత్రికలో వేసుకుంటాననీ రాసిన వుత్తరం చూసుకు సుశీల నవ్వుకుంది. ఆ పత్రికా సంపాదకుడు వుత్త అమాయకుడు అని వెంటనే కనుక్కుంది. అసలు రచనలు వెయ్యటమే వుపకారంగా భావించే ఎడిటర్లు చాలామంది వున్నారు గాని పారితోషికం యివ్వలేనంటూ మనవి చేసుకునే మనిషి యితనొక్కడే కాబోలు.

పారితోషికం అక్కర్లేదని సుశీల తక్షణం రాసింది. 'తపన' 'తేజస్సు'లో పడింది.

తర్వాత సత్యం తన కృతజ్ఞత తెల్పకోడానికి జార్జిటవున్ లోని సందులన్నీ తిరిగి చీకటి-చీకటి పడుతూండగా సుశీల వుండే యిల్లు కనుక్కున్నాడు. అది శనివారం సాయంత్రం. రాజమ్మ బియ్యం ఏరుకుంటోంది. సుశీల సూదీ దారం పుచ్చుకు ఏదో కుడుతోంది. ఫలానా నెంబరు యిల్లు యిదేనా?-అని ప్రశ్నిస్తూ ప్రవేశించాడు సత్యం.

సుశీల తలెత్తి చూసింది. వుంగరాలు తిరిగిన క్రాపు. ఆ వుంగరాలు నుదురు మీద పడుతున్నాయి. కళ్లల్లో అసంతృప్తి-అశాంతి. చామంచాయి. పెద్దముక్కు, విశాలమైన నుదురు, కాళ్లకి చెప్పులు లేవు. తెల్లలాల్చి, కలకత్తా అంచు పంచె. బట్టలు కూడా కాస్త మాసివున్నాయి. చేతులో రెండు పుస్తకాలు. తటాలున చూడగానే మనిషి పెద్దమనిషిలా కనుపించాడు.

సమాధానం చెప్పకుండా సుశీల తనని ఆపాదమస్తకం పరిశీలిస్తూంటే సత్యం ఖంగారుపడ్డాడు. కొంపతీసి తను తప్పు నెంబరింట్లో ప్రవేశించలేదుగదా! అని తటపటాయిస్తున్నాడు.

"సుశీలగారు వుండేది యీ యింట్లోనేనా?"

"నేనే - మీ కేం కావాలి?"

సత్యం ఖంగారుపడ్డాడు. ఆడంబరంలేని యీ సుశీల - తను వూహించుకున్న రచయిత్రితో సరిపోడంలేదు. ఆ కళ్లుమటుకు తనని చాలా స్నేహంగా పలకరిస్తున్నాయి

ఒకరి నొకరు ఎరుకపర్చుకున్నారు. ఆ తర్వాత సత్యం ప్రతి శనివారం సుశీలని కలుసుకుంటుండేవాడు, ఆ పైన సుశీల అతనికి రచనలద్వారా చాలా సాయం చేసేది. అతనివద్ద ఒక్కకాని పుచ్చుకునేది కాదు. ఈ ఆరునెలలలో సుశీల రచనల వల్లనో-సుశీల సత్యాని కిచ్చిన ఆత్మబలం వల్లనో పత్రిక మూడువేలదాకా అమ్ముతోంది. సత్యం తను సుశీలకు చాలా బాకీ పడుతున్నానని అనుకునేవాడు. సత్యం పత్రిక కాస్త ఒకదారిన పడిందికాని ఇంటి వ్యవహారాలూ - డబ్బూ దస్కం అవి మొదలుపెట్టిన చోటునే వున్నాయి



సత్యం పెద్దపిల్లకు ఆరు, రెండోదానికి మూడు, చంటిపిల్లకు తొమ్మిదో నెల. దాని పోతపాలు, భార్యకి రోగం, వీటికి తోడు భర్త అప్రయోజకుడనే కసీ - యిదీ అతని జీవితక్రమం. డిగ్రీ పుచ్చుకోగానే వున్న కొస్త ఆసక్తీ జర్నలిజంలో పెట్టేశాడు. మరో వుద్యోగం చేసేందుకు అతని ఆత్మ వొప్పడం లేదు. 'తేజస్సు'లో పోతున్న అతని విశ్వాసాన్ని సుశీల లేవనెత్తింది. సుశీలకి తన కష్టాలను చెప్పడంలో సత్యం కొంచెం కూడా వెనుకాడలేదు. సుశీల అన్నీ వోపిగ్గా వినేది. చాలా తక్కువ మాట్లాడేది. సత్యంతో ఏ వొక్కనాడూ తనకీ యిబ్బంది అనే మాట కూడా అనలేదు. ఆ స్నేహంతో సుశీల హృదయకవాటం తెరుచుకుంది.

* * *

1941 రెండవ ప్రపంచయుద్ధం. సత్యం పత్రిక కొస్త దారిలో పడుతోంది. సంసారం కూడా బాగానే సాగుతోంది. ఒక శనివారం సుశీలయింటికి వొచ్చాడు. ఏవో మాటల్లోపడి "తన దగ్గిర మూడువేలుంటే చక్రం తిరుగుతుంది" అన్నాడు సత్యం.

"ఎల్లా ?"

"నే నెరుగున్న ప్రెస్సువాడు యుద్ధానికి భయపడి టైపులూ మిషనూ అమ్మకు పోతున్నాడు. 3500 లు చెబుతున్నాడు. నాదగ్గిర 500 లున్నాయి మిగతాది వుంటేనా ?"

"విషయ మేమిటో స్థిమితంగా చెప్పండి" అంది సుశీల చేరుమాలు చివర నగ్గిషీ చేస్తూ.

సత్యం సమస్తం విశదంగా తెలియజెప్పాడు. పత్రికకు ప్రెస్‌వుంటే ఎంతో లాభం. ప్రింటింగ్ ఛార్జీలు కలిసొస్తాయి. ఎంత లేదన్నా నెలకి మరో మూడొందలు మిగులుతాయి. అంటూ గుక్క తిప్పుకోకుండా లెఖ్ఖలూ అవీ చెప్పాడు.

"మా ఆవిడవంటిమీద నగలు అమ్మదామని వుందిగాని, ఆమెకి నామీదా, నా ప్రయోజకత్వం మీదా కొద్దిగా కూడా నమ్మకం లేదు.

"ఆ ప్రెస్‌వాడు ఎన్నాళ్లదాకా ఆగుతాడు ?"

"ఇంకొ పదిరోజులు వుండవచ్చు. అయినా అది మన తాహతుకిమించిన పని" అని వూరుకున్నాడు సత్యం.

సత్యం వెళ్ళాక సుశీల చాలాసేపు ఆలోచనల్లో పడింది. 'మూడువేలుంటే చక్రం తిరుగుతుంది.' పదేపదేవినిపించాయి ఆ మాటలు. తనకిమటుకు ఎవరున్నారు? వుండేందుకు యిల్లుంది. జీవనోపాధికి వుద్యోగం వుంది. అత్తారిచ్చిన రెండువేలూ, వడ్డీ చిన్నంచిదరా, మెళ్లో మూడు పేటల గొలుసూ యివన్నీ కలిపితే మూడు వేలూ అవకేం? ఒక మంచివాడు బాగుపడతాడు.

పై శనివారం సత్యం వచ్చాడు. చాలాసేపు ఖబుర్లయాయి. "ప్రెస్‌వాడు ఏమయ్యాడు ?" అని ప్రశ్నించింది సుశీల.

"యింకా ఎవరూ ఎక్కడం లేదు. నేను చాలాచోట్ల ప్రయత్నించాను. లాభం లేకపోయింది" అన్నాడు నిరుత్సాహంగా.

"మీరు సోమవారం మధ్యాహ్నం పన్నెండుగంటలవేళ ఒకసారి యిలా రాగలరా ?" అంది సుశీల.

"అల్లాగే" అన్నాడు సత్యం.

సుశీల ఏనాడూ తనని ఏ పనికీ సాయం రమ్మని అడగలేదు. అకస్మాత్తుగా సోమవారం రమ్మనడం సత్యానికి వింతగా తోచింది. తలబద్దలు గొట్టుకున్నా కారణం దొరకలేదు.

సోమవారం సత్యం వచ్చేవేళకి సుశీల సిద్ధంగా వుంది. ఇద్దరూ నైనాబజారువైపు నడిచారు. సుశీల యీవిషయం, ఆవిషయం మాట్లాడుతోంది.

నెమ్మదిగా బాంక్ గుమ్మం దగ్గిర ఆగారు. సుశీల మెట్లు ఎక్కుతూ "అన్నట్టు చెప్పడం మరిచాను. నా మనువర్తి తాలూకు రెండు వేలూ, యింకొ నగా నాణెం అమ్మిన మొత్తం అంతా కలిసి మూడువేలున్నాయి. అవి తీసుకుందామని మిమ్మల్ని రమ్మన్నాను. ఆ డబ్బుతో ప్రెస్సు కొనండి," అంది సత్యంవంక చూడకుండా.

కాళ్లకింద భూమి కుంగిపోతున్నట్టు అనిపించింది సత్యానికి. నిజమా! తన చెవులను నమ్మలేకుండా వున్నాడు. సుశీల తన సర్వస్వం యిచ్చేస్తోందా? తనీ త్యాగానికి అర్హుడా? వణుకుతున్న అతని వేళ్ళని చేతులోకి తీసుకు మెట్లెక్కింది సుశీల. సత్యం కళ్లమ్మట నీరు తిరిగింది.

వరాండాలో బెంచీమీద కూచుని సత్యం తనకి డబ్బు వద్దని చెప్పాడు. తనకోసం సుశీల యిలా చేయడం మంచిది కాదన్నాడు.

"దీంతో పత్రిక బాగుపడుతుంది. అయినా మీకోసం కాదు. పత్రికకోసం," అంటూ అతని మాటల్ని నెట్టేసింది.

చివరికి ప్రెస్ ఆమెపేరనన్నా కొననిమ్మన్నాడు. సుశీల కళ్లు ఎఱ్ఱబడ్డాయి. "ప్రెస్సు నా పేర కొనుక్కునేట్టయితే - మిమ్మల్నెందుకు పిల్చేదాన్ని. వూరుకోండి పిచ్చిమాటలు మీరూనూ."

భార్యతో తన అదృష్టంగురించి చెప్పడమా మానడమా? సుశీల ఆసాయంత్రం మాటల సందర్భంలో 'యీ విషయం మనిద్దరి మధ్య - పెదవి దాటకూడదు.' అని ఆంక్ష పెట్టింది. పైగా యీ సంగతి భార్యతో చెప్తే, మరో అర్థం కల్పించవచ్చు. సుశీల స్నేహంకోసం యిచ్చిందంటే అది ఆమె కందని సమస్య.

రోజులు దొర్లుతున్నాయి. సత్యం ప్రయోజకుడయాడు. వృద్ధిలోకి వచ్చాడు. నెల నెలా రెండుమూడు వందలు మిగుల్తున్నాయి. రెండుమూడు సార్లు "యీ ఐదువందలూ వుంచండి" అంటూ సుశీలకి యివ్వబోయాడు.

"నేను మీకు అప్పుగా యివ్వలేదు. యిస్తే పుచ్చుకునేదాన్ని" అని నవ్వి వూరుకునేది ఆమె.

* * *

రాజుల్ని బికారులుగా చేస్తే యుద్ధం, బికారుల్ని రాజులుగా చెయ్యడం సహజం. యుద్ధజ్వాలలు అలుముకుంటున్నాయి. ఎక్కడ వాళ్లక్కడ పట్నం నుంచి పారిపోతున్నారు. సత్యం భార్యాపిల్లల్ని పుట్టింటికి పంపించేశాడు.

"నువ్వెందుకీ పట్నంలో? వెళ్లిపోరాదా? ఇక్కడ ఆడవాళ్లుండే పరిస్థితులు లేవు. అన్నాడు తనభార్య వెళ్లిన వారానికి సుశీలతో సత్యం.

"మీరు చుట్టాలూ పక్కాలూ వున్నారు. నాకెవరున్నారు? ఎక్కడికి పోయినా ఒకటే. ఇక్కడైతే నాసొంతయిల్లు అని అన్నా వుంది. పొరుగూళ్లో నే చేసేదేమిటి ?" అంది సుశీల.

మద్రాసునిండా ఖాళీయిళ్లు. పనివాళ్లు దొరకడం మహాగండంగా వుంది. బ్లాక్ అవుటు. హోటళ్ళు లేవు. షాపుల్లేవు. సినిమాల్లేవు. నానాఖంగాళుగా వుంది. సత్యానికిడబ్బు మటుకు రెండుచేతులా దొరుకుతోంది. ఈమధ్య భార్యాపిల్లలు లేకపోవడం, పూర్వమంత ఆర్థిక చిక్కులు లేకపోవడంవల్లా సత్యానికి కొస్త వూపిరి తీసుకునే సమయం దొరుకుతోంది. అతను ఎక్కువ కాలం సుశీలవద్దే గడుపుతుండేవాడు.

కిందవాటాలో వుండే రాజమ్మ అందరికి మల్లే ప్రాణాలకు భయపడి పట్నం వదిలి పారిపోయింది. సుశీల వొక్కర్తే

(29-వ పేజీ చూడండి)

సుశీ

(19-వ పేజీ తరువాయి)

ఆడది ఇంట్లో వుండటంనికి ఎలా? తను సాయం వుంటానన్నాడు సుశీలతో. సందులు - బజార్లు నిర్మానుష్యం. సుశీల అలాగే స్కూలికి వెళ్లి వస్తోం డేది. స్కూళ్లకి సెలవ లిచ్చారు. సుశీల ఒకనాడు సత్యంతో "ఎ. ఆర్. పి. లో జేరుతున్నాను." అంది.

"స్కూలు లేదుగా యింట్లో వుండరాదూ - యీ బాధలన్నీ ఎందుకూ?" అన్నాడు ప్రూఫులు దిద్దుతూ సత్యం.

"ఇంట్లో తోచద్దూ? యిరవైనాలుగు గంటలూ ఏం చెయ్యను?" అంది బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ.

"నే నున్నానుగా" అన్నాడు కొంటెగా నవ్వుతూ.

"మీ రుంటే మీతో నేనా ప్రపంచం?" అంది ఛర్రున చూస్తూ సుశీల.

సత్యం అధఃపాతాళానికి కృంగినట్లు తలపోశాడు. ఈ రెండు నెలలలోనూ సత్యం సుశీల తనని ఎంత ప్రేమించింది తెలుసుకున్నాడు. బయట పత్రికల్లో పని చేసే మొగవాళ్లు సంసారాల్ని పంపి తిండి తిప్పలు లేక యిబ్బందులు పడ్తూంటే తను హాయిగా సుశీల చేత్తో చేసిన పదార్థాలు తిని, ఖుషీగా బతుకుతున్నాడు. ఇటు పత్రిక దివిటీలా వెలుగుతోంది. స్త్రీ. తను ప్రేమించిన పురుషుణ్ణి ఏ ఔన్నత్యాలకి గొనిపోతుందో యీ నాడు తెలిసింది సత్యానికి. సత్యం తన వైవాహిక జీవితంలో స్త్రీని పిల్లలుకనే యంత్రంలా, భర్తమీద విసుక్కునే మనిషిలా, ఓర్పులేని మాతలా చూశాడు. అతనికి సుశీలసాంగత్యంతో స్త్రీ అంటే ఏమిటో మొట్టమొదటిసారి తెలిసింది. సుశీల తనది. తను సుశీలవాడు. తను జీవితాలు పెనవేసుకుపోయినాయని అనుకునే వేళకి సుశీల యీ మాటలు అంది.

సుశీల తనకి అర్థం కాదా? తను అర్థం చేసుకోలేడా? తను లేనిదే బ్రతకలేను అన్నట్లు ప్రవర్తించి కరుకుగా యిలా మాటల్తో నొప్పిస్తుందే?

"ఆ ప్రూఫులు కానియ్యండి" అన్న సుశీలకేకతో తలెత్తి చూశాడు.

ఎదురుగుండా కాఫీతో నుల్చుంది సుశీల. ఆ కళ్లు తనని పిల్చి పీడిస్తున్నాయి. తేరిపార చూస్తున్నాడు ఆమె కళ్లలోకి.

నుదిటిమీద నుంచి వుంగరాల్ని పైకి తోస్తూ "బండబ్బాయికి పని జరగదు - వూ—" అంది సుశీల అతని తలని గుండెలకు హత్తుకుంటూ. సత్యం ప్రపంచాన్ని మర్చిపోయాడు.

* * *

నాలుగోనాటి సాయంత్రం సత్యం యింటికి వొచ్చే వేళకి సుశీల సత్యంకోసం బనియనులు కుడుతోంది. 'సుశీ - నిన్న రాత్రి బాంబు వేశారట - మనకి తెలీనే లేదు." అన్నాడు పక్కన జేరుతూ.

"వూ" అంది తలెత్తకుండా.

"మ నింటిమీద పడుంటేనో?"

"ఏం పడితే - అంతకంటె మంచి చావు నే కోరుకోను." అంది సత్యం తలని వొళ్ళోకి లాక్కుని నుదుటిమీద జుట్టు పైకి తోస్తూ.

ఆ క్షణాన బాంబు పడిపోతే ఎంత బాగుండును - అనుకున్నాడు సత్యం. ఈ మాట ప్రతి క్షణం అతనికి జ్ఞాపకం వస్తూంది. అందరికీ యుద్ధం ఒక భీభత్సం. తన కది సుందరస్వప్నం.

* * *

కొంచెం వత్తిడి తగ్గింది. తాళాలు వేసుకున్న యిళ్లను తెరిచి మొగవాళ్లు ప్రవేశిస్తున్నారు. రాజమ్మ కూడా తిరిగొచ్చింది. ఇంకో రెండు నెలలకి సత్యం భార్యకూడా తిరిగివచ్చింది ముగ్గురు పిల్లలతోనూ.

* * *

1945 లో యుద్ధం పూర్తిఅయింది. సత్యంజీవితంలో అనేక మార్పులొచ్చాయి. యుద్ధంలో చాలామంది వేలూ లక్షలూ సంపాయించారు. ఎల్లా అని అడిగితే, అది వారికే తెలీదు. బ్లాక్ అనండి ఏది అనండి, ఒక లక్షరూపాయలుదాకా ఆస్తి సంపాయించాడు సత్యం. చివరగ ఎవాక్యుఏషన్ టైములో చక్కటి మూడు బంగళాలు కొన్నాడు. అతని చక్రం తిరిగింది. డబ్బుతోపాటు పేరు ప్రతిష్ఠ లొచ్చాయి. పత్రిక రెండుమూడు వేలనుంచి - యిరవై ముప్ఫయివేలదాక అమ్ముడుపోతోంది. ఎన్ని పనులున్నా ప్రతి శనివారమూ రెండుగంటలనించి రాత్రి పదిగంటలదాకా సుశీలతో గడుపుతూంటాడు.

కార్లూ, బంగళాలూ, అధికారం సత్యం జీవిత విధానాన్ని మార్చేశాయి. కాని సుశీలలో కించిత్తుకూడా మార్పు లేదు.

"మాంబళంలో మేడ కట్టిస్తున్నాను," అన్నాడు సత్యం.

"బాగుంది" అంది సుశీల.

"నీకోసం" అన్నాడు.

"నా కెందుకు నాయిల్లు నాకుందిగా?"

"యీయిల్లు పాతబడిపోయింది. సందులూ అవీ గలీజుగా వుంటుంది. అది నీకోసం" అన్నాడు పురుషదర్పంతో.

"అల్లాగా" అంది తలూంచుకు సుశీల

"ఎన్నాళ్లనుంచో చెప్పాలని వుంది! నువ్వింక ఉద్యోగం మానెయ్యరాదూ?".

"ఏం?" అంది సుశీల.

"ఈ డబ్బంతా నీది కాదూ? హాయిగా మాంబళం యింట్లోను వుండచ్చు"

"వూ"

"నెల కొచ్చే ఆ యెనభై రూపాయలకే యీ కష్టం దేనికి? యింత వుండగా నువ్వుకూడా సంపాయించడం ఎందుకు? యీ యిల్లు అద్దె కివ్వడమో అమ్మడమో చేస్తే సరి" అన్నాడు ధైర్యంగా.

"నే నెందుకు వుద్యోగం మానాలి? యీ యింట్లోంచి కదిలే అవసరం నాకేం కనపడటం లేదు. సందులూ గొందులూ అంటారా? నాకివి పదిపదిహేనేళ్ల నుంచి అలవాటు. అందువల్ల ఫరవాలేదు. మీ రే ఆ కట్టబోయే యింట్లో వుండండి. నే సంపాయించుకునేది నాకోసం."



సుశీల సమాధానం చెప్పి లోపలికి వెళ్లి పోయింది. సత్యం హతాశుడై కూర్చుండి పోయాడు. అలాగే కాసేపుండి యింటి దారి పట్టాడు.

*   *   *

మరుసటి శనివారం సత్యం సుశీల యింటికొచ్చాడు. సుశీల ఏదో అల్లుతోంది. తలెత్తి చూసింది. గుమ్మంలో సత్యం.

మొట్టమొదటిసారి తను చూసిన సత్యానికీ యితనికీ ఎంత తేడా. ట్వీడ్ సూటులో సత్యం. చేతులో పుస్తకాలకి బదులు సిగరెట్ డబ్బా. తీర్చి దిద్దిన క్రాపు. కళ్లలో అశాంతికాదు అహంభావం. కొత్త తెల్లబడ్డాడు. వూచలావుండే సత్యం బొద్దు బారాడు.

ఇద్దరూ మెట్లెక్కారు.

"ఆనాడు నామాట పూర్తిగా వినకుండా నే నీకు కోపం వచ్చి వెళ్లిపోయావు. నే చెప్పేది విని మరీ సమాధానం చెప్పు." అన్నాడు కుర్చీలో కూలబడి.

సుశీల తలెత్తలేదు. చేతిలోని అల్లికతో గుమ్మంలో కూర్చుండిపోయింది.

"మేడ పూర్తి అయింది. వొచ్చే నెలలో గృహప్రవేశం" అన్నాడు సుశీలవంక పరిశీలనగా చూస్తు.

సుశీల కళ్లెత్తలేదు.

"గృహప్రవేశానికి ముందే నిన్ను పెళ్లి చేసుకోవాలని నా వుద్దేశం. తర్వాత నువ్వు నాభార్యగా ఆయింట్లో అడుగెట్టచ్చు. అందుకోసమనే వుద్యోగం మానుకొంటున్నాను." అన్నాడు సిగరెట్ ముంచి

సుశీల నుంచి సమాధానం రాలేదు.

"ఈ ధనం— హోదా— దర్జా అన్నీ నువ్వు పెట్టిన భిక్ష. నా ప్రతి ఒక్క ఆనందం నువ్వు పంచుకోవాలి. నువ్విలా టీచరు చేస్తూవుండటం మన హోదాకు తగదు. నిన్ను పెండ్లాడి మాంబళం యింట్లోకి తీసుకెళ్తాను. పిల్లలూవాళ్లూ పూర్వపు మైలాపూర్ యింట్లో వుంటారు. నీకూ వాళ్లకీ సంబంధం వుండదు."

"చెప్పడం అయిందా— యింకా వుందా?" అంది సుశీల తలెత్తి.

ఆకళ్లను చూసే వేళకి సత్యానికి భయమేసింది.

"మీకు పూర్వం ఒకసారి చెప్పాను. డబ్బు అప్పుగా యివ్వలేదని. పెండ్లి చేసుకునేందుకు మీరు సిద్ధంగా వున్నా నేను లేను. మీ హోదాకు తగక పోయేందుకు మీకు నేనెవర్ని? మీకూ నాకూ స్నేహం తప్ప చిన్న మెత్తు బాంధవ్యం లేదు. నా వుద్యోగం మానను. యీ యింట్లోంచి కదలను. మీ పెద్దపెద్ద కార్లను యీ గల్లీలో వుంచి యిబ్బందులు పడకండి. యిదే నా సమాధానం. మీకు స్త్రీ అంటే ఏమిటో తెలీదు," అని సుశీల కిందకి దిగి వెళ్ళిపోయింది.

ఈసారి సత్యానికి భయం వెయ్యలేదు. సుశీలమీద కోపం వచ్చింది. అతని అహం దెబ్బతింది. తనంతవాడు పెళ్లాడుతా నని వస్తే నిరాకరించింది. తనకీ నాకూ సంబంధం లేదుట. ఆడదే ఆమాట అంటే మొగవాడు తనకేం? తను కిందకి దిగి దేవులాడుతున్న కొద్దీ సుశీల కొండెక్కుతోంది. కనపడక పోతేనేగాని సుశీలకి తన విలువ తెలియదు.

కారులో కూచున్నాడే గాని, అతని మనసు మనసులో లేదు. సుశీల మొదటి నుంచి తన చేయి పైన వుంచుకుంటూ వచ్చింది. ఆఖరికి తన చేతినుంచి ఒక బహుమతీ అన్నా పుచ్చుకోలేదు. మొదట్లో ఆ డబ్బు పత్రికకు ఖర్చుపెట్టండి - అంటూ తప్పించుకువచ్చింది. తనకు డబ్బు అడుగుతున్నప్పటినుంచీ ఒకపక్క బయటపని, మరోపక్క సుశీల కావాలని దూరం అవుతోంది. ఎటుచూచినా సుశీలకే తను అప్పుబడ్డాడు.

ప్రేమించిన స్త్రీకి పురుషుడు తనిచ్చిన కంటె యింకేమివ్వకలడు. భార్యగా చేసుకుంటా నన్నాడు. సమస్తం పంచుదామనుకున్నాడు.

*   *   *   *

ఆ ఏటి కావిడు గడుస్తోంది. మళ్లీసత్యం సుశీల గుమ్మంతొక్కలేదు. సాధ్యమైనంత వరకూ ఆవిడను మర్చిపో జూస్తున్నాడు. డబ్బుసంపాదనతో వూపిరి ఆడటంలేదు.

ఇద్దరుముగ్గురు, సాయంతో ఫిలిమ్‌కంపెనీ పెట్టాడు సత్యం. సత్యంపట్టిందల్లా బంగారం అవుతోంది. మొదటి రెండు పిక్చర్లతోనే సిరి అందుకుంది. సత్యం మిలియనీర్ అయాడు.

పది లక్షల, ఆసామి సత్యం. మాంబళం లోని పెద్దబంగాళా టెర్రెస్ మీద పడుకుని నక్షత్రాల్ని చూస్తూంటే, నెలకి వందరూపాయలు సంపాయించుకునే సుశీల జ్ఞాపకానికి వచ్చేది. ఈ లక్షలు తన నేర్పు వల్ల వచ్చాయా లేక ఆ మహత్తు సుశీలడబ్బులో వుందా? ఇది తెగని సమస్య. ఈ పునాది గురించి తనకి సుశీలకి తప్పమరో ప్రాణికి తెలీదు. ఇప్పుడు యిద్దరికీమధ్య సంఘం ఎత్తయినగోడలుకట్టింది. శనివారాలు సత్యం ఎవరికీ చెప్పుకోలేని బాధతో కుమిలిపోయేవాడు.

ఆరునెలలక్రితం సత్యం పెద్దమ్మాయికి యాభైవేలు ఖర్చుచేసి దేవేంద్ర వైభవంగా వివాహంచేశాడు. పెళ్లిపందిరి కళ్లపండుగగా వుందని చూసినవారన్నారు. ఇంత సందడిలో, గౌరవంలో ఆతిథ్యమర్యాదలలో సుశీలలేదు. సుశీలకి ఆహ్వానమైనా వెళ్లిందోలేదో? అత నామెజ్ఞాపకాన్ని తుడిచివేయ ప్రయత్నించేవాడు.

సత్యం భార్య సోషల్ వర్కర్ అయింది. పెద్ద పెద్దసభలకీ వాటికి హాజరవుతోంది. భర్త ఆర్జనతనవల్లే పెరిగిందని ఆమెవుద్దేశం. నాకరిక చిహ్నాలయిన క్లబ్ లూ, గుర్రపుపందాలు, ప్రతిసమ్మర్‌కి కొడైకనాల్ వెళ్లిగడపడం- యిలాంటివన్నీ అలవరచుకుంది.

యుద్ధంలో సంపాయించిన ధనంపైన సంపాయించినధనం వాటితాలూకు లాభాలకీ ప్రతి ధనవంతుడికి మల్లే టాక్సులు సరిగా కట్టడంమానేశాడు సత్యం. ఈమధ్య మూడు నెలలనుంచి యిన్‌కమ్‌టాక్స్ ఆఫీసరుని తప్పించుకోడంలో అతనునిమగ్నుడయాడు. ఒకటారెండా నాలుగులక్షలు కట్టాలి గవర్నమెంటుకు కట్టాలిసినడబ్బు.

వేసంగికి భార్యా పిల్లలూ కొడైకనాల్ వెళ్లారు.

నాలుగులక్షలు ఎక్కడినుంచి తేవాలి? అదీ సమస్య. భార్యాపిల్లలూ వెళ్లి నాలుగు రోజులయింది.

సత్యానికి రెండురోజుల్నుంచి జ్వరం తగుల్తోంది. అంత పెద్ద యిల్లూ బావురుమంటోంది. ఇట్లో ప్రతివాళ్లు తన ఆజ్ఞల్ని పాలించేవారే గాని ప్రేమతో చూసే వారు ఒక్కరూలేరు. ఆఖరికి భార్యకూడా తనని చూసి దడుస్తుంది. మనసిచ్చి మాట్లాడదు. ఇంత భోగంలోనూ ఏదో వెల్తి- ఆరాటం; ఏదో తనని బంగారుపంజరంలో బంధించినట్లుంది. సత్యానికి.

వారంరోజుల దాకా ఆఫీసుపనులు చూడననీ, ప్రతివిషయం అలా ఆపమనీ సెక్రటరీకి క్రిందటిరోజు ఫోన్ చేశాడు. శరీరమంతా ఏదో నీరసంగా వుంది.

నపుంసకతైలం

అంగ, నరములు బలహీనత చెంది చిన్నదైన, తిర్గి యధాప్రకారమై పూర్తి సౌఖ్య మనుభవించుటకు 45 యేండ్ల ప్రఖ్యాతి చెందినది.

1 సీసా రూ. 10/ వి. పి. రూ 1-0-0

డా॥ రత్నం సన్స్ మెడికల్ హాల్

మలకపేట బిల్డింగ్స్,

హైద్రాబాద్, దక్కన్.

సాయంత్రం నాలుగయింది. గది చుట్టూ వట్టివేళ్లు. ఎంతో చల్లగా, హాయిగా వుంది. మంచంమీద పడుకున్నాడు. ఎదురుగా కాలెండరు ఏప్రిలు ఆరో తేది. ఏవో ఏవో జ్ఞాపకం వచ్చాయి.

తన కిలాగా జ్ఞాపకం. ఏప్రిల్ ఆరో తేదినే మొట్టమొదటిసారి సుశీలయింటికి తను వెళ్లింది. ఒక దశగడిచింది. ఆమె స్నేహం తన జీవితంలో ఎంత మార్పు. కాని ఆమె జీవితంలో మటుకు తను వీసమయినా మార్పు తేలేకపోయాడు.

చిత్రం - ఏడాదినుంచి పూర్తిగా మరిచిన సుశీల యీనాడు జ్ఞాపకం వచ్చింది. జ్వరంగా వుంది. సుశీల దగ్గరకెళ్తే! తనని లోపలికి రానిస్తుందా? ఐశ్వర్యంలో తను మొహం చాటేశాడే! ఆఖరికి పిల్ల పెళ్లికి కూడా పిలవలేదు. కాని సుశీల చెయ్యి పత్తే తన జ్వరం యిట్టే తగ్గుతుంది. ఒక్కసారి మనసు విప్పి సుశీలతో మాట్లాడుతే యీ భారం పోతుంది.

యీ నాలుగేళ్లలో సుశీలలో ఏలాటి మార్పొచ్చిందో, బహుశా తన వియోగం ఆమెను కృంగదీసిందా? జబ్బు చేసివుంటుందా? ముసలిదయిపోయి వుంటుందా? ఆఖరికి తను క్షేమం అన్నా కనుక్కో లేదు. సుశీల కనుక్కుంటూనే వుంటుంది. తనే క్రూరుడయిపోయాడు.

రెండురోజు లయింది గడ్డం గీసుకుని. గడ్డం మాసి, బట్టలు నలిగి వున్నాయి. బాల్కనీలోకి వచ్చి చూశాడు. చీకటి పడబోతోంది. గబగబ షర్టు తీసుకుని మెట్లు దిగాడు.

డ్రైవరు తలుపు తీసుకు పోర్టికోలో నిలబడ్డాడు. కారు వద్దని తల వూపి, సందు చివరిదాకా తల వంచుకు నడిచాడు. పక్కనే పోయే టాక్సీ పిల్చి సుశీల అడ్రసిచ్చాడు.

అతని హృదయం జ్ఞాపకాలతో అనుమానాలతో వూగిసలాడుతోంది. కారు కదలనట్టే వుంది. ఏదో - ఏదో బుర్ర తిరుగుతోంది.

*　　*　　*

టాక్సీ యింటిముందు ఆగింది. వాడిచేతిలో నోటుపెట్టి దిగాడు సత్యం.

గుమ్మంలో అడుగెట్టాడు. సుశీల వరండాలో కూచుని స్వెటర్ అల్లుతోంది. తలెత్తిచూసింది. సత్యం ఒక్క గంతున వాళ్లో కొచ్చి పడి ఏడుస్తున్నాడు.

సుశీల కదల్లేదు. పదినిముషాలకి తలెత్తాడు సత్యం. మొదటిసారి సుశీలకంట్లో కన్నీరు చూశాడు. మాసిన గడ్డం, పాలిన చెక్కిళ్లు, మురికి గుడ్డలూ, దశక్రింద చూసిన సత్యం తిరుగా అలాగే ప్రవేశించాడు. నుదుటిమీద పడిన నెరిసినజుట్టును పైకితోస్తూ "పిచ్చి బాబూ అంది" ప్రేమగా.

సత్యం తలని సుశీలబుజాల్లో దాచుకున్నాడు.

"మేడమీదికి పదండి. కాఫీ తెస్తాను" అని రెక్కపట్టుకు తీసుకెళ్లింది సుశీల.

దుప్పటిదులిపి అతన్ని పడుకోబెట్టి, కింది కెళ్లి కాఫీ తెచ్చింది. సత్యం బుద్ధిమంతుడిలా కాఫీతాగి - సుశీలవళ్లో తలెట్టుకు పడుకున్నాడు.

ముఖం కడిగించి, గుడ్డలు మార్పించింది. అతను తిన్నచారూ, అన్న పుగిన్నె కిందకు పట్టుకెళ్తూ "కళ్లుమూసుకు పడుకో-క్షణంలో వస్తున్నా" అంది మెట్లమీంచి. సత్యం గదిని తేరిపార చూశాడు. గది కొంచెంగూడా మారలేదు. నిన్నతను పెట్టి వెళ్లినట్టున్నాయి సామాన్లు. సుశీలముఖంలో మరీ ప్రశాంతత కనపడింది. కొంచెంగూడా మార్పు లేదు. తను, ఏవో, ఏవో ఊహించుకున్నాడు. ఆఖరికి తెల్లవెంట్రుకకూడా లేదు.

సుశీలను చూశాక తనీ అయిదేళ్లలో ఎంత మార్పుపొందినదీ అతనికి మొదటిసారి తట్టింది.

సుశీల పైకి వచ్చింది. తలలోని మల్లెలు గుప్‌మన్నాయి. సత్యాన్ని రోజూ చూస్తున్నట్టే ప్రవర్తించింది. ఆమెకు ప్రశ్నలు లేవు. సుశీలకి యీలోతు భగవంతుడు ఏత వస్సుకి ప్రసాదించాడో!

తలదగ్గరకూచుని చెక్కిళ్లు నిమురుతోంది. సత్యం తొడుక్కున్న లాల్చీ గుండీలు సరిగా పట్టడంలేదు. సుశీలదగ్గరకు లాగి పెట్టింది. ఇంకా గుండీలు కనపడ్తూనే వున్నాయి. సుశీల కిలకిలనవ్వింది. సత్యం తృప్తిగా నవ్వాడు.

వార్ టైములో యిద్దరూవుండగా సుశీల ఆలాల్చి కుట్టింది. అప్పుడు సత్యానికది చాలా వోదులుగా వుండేది. అందువల్ల పెట్లో అడుగున పడేసింది సుశీల. ఆపాతదాన్ని తీసి యీనాడు రాత్రితొడిగింది సత్యానికి.

ఇద్దరూ భావయుక్తంగా నవ్వారు.

కిటికీలోంచి నక్షత్రాల కాంతిపడుతోంది పక్కమీద. ఆ కాంతిలో పక్కన సుశీల. ఏదోలోకంలో వున్నట్టుంది సుశీలకి.

"సుశీ" అన్నాడు సత్యం మృదువుగా.

"వ్యక్తిత్వాన్ని గురించి కథలు రాశారు గాని, పక్కమనిషి వ్యక్తిత్వాన్ని భరించలేకపోయారు. స్త్రీకి భార్య అవడంకంటే ఎక్కువ ఆశయంకూడా వుంటుందని మర్చిపోకండి" అంది కిలకిల నవ్వుతూ.

ఆ కిలకిలనవ్వు, సన్నగా పారే సెలయేరుని జ్ఞప్తికి తెస్తుంది. సెలయేరు గట్టుకెళ్లి - నువ్వు నాపక్కనే పాడు, ఆ గలగల శబ్దం నా ఒక్కడికోసమే చెయ్యి అనడం, చంద్రుణ్ని ఆవెన్నెల నాకే యియ్యి, నాయింట్లోనే కట్టేసుకుంటాననడం. మల్లెల సువాసన నా ఒక్కడికే కావాలి నాజేబులో వుంచుకుంటాననడం యిలాంటివి ఎంత అసాధ్యమో సుశీలను పట్టుకోడం కూడా అంతే! అని సత్యానికి ఒక గొప్పనిజం తట్టింది.

అన్నీ, లక్షలు, భార్యాపిల్లలు, యిన్‌కమ్‌టాక్స్-కొడైకనాలు అన్నీ మబ్బులో కలిసి పోయాయి. జీవితాన్ని వెలిగించే ప్రేమజ్యోతి కనిపించింది సత్యానికి సుశీల ముఖంలో.

★

రు. 100 బహుమానం

(గవర్నమెంటు రిజిస్టర్డు)

తెల్లవెంట్రుకలను అంత మొందించండి రంగులు వాడకండి. మా ఆయుర్వేద సువాసన "సెంట్రల్ మోహిని ఆయిల్" 60 ఏళ్లదాకా నల్లగా ఉంచును. ఇది మీ దృష్టిని వృద్ధిపరచి తల నొప్పిని కుదుర్పుతుంది. కొన్ని వెంట్రుకలు తెల్లబడితే రూ. 2-8-0 తో ఒక సీసా (మూడు ఒకసారి 6-8-0) కొనండి. హెచ్చుగ తెల్లబడితే 3-8-0 (మూడు ఒకసారి 9-0-0.) తలంతా తెల్లబడితే రు. 5-0-0 (మూడు ఒకసారి రు. 12) కొనండి. ఇది అబద్ధమని ఋజావుచేసిన వారికి రు. 100 బహుమానం. పూర్తి విశ్వాసానికి అణాన్నర స్టాంపు పంపి గ్యారంటీ తీసుకోనండి.

Bharat Kalyan Aushadhalaya.

Post Bag No 6725, Calcutta. (A P)